# మమతల కోవెల

హెబ్బటం ఆదమ్ బాషా



**ఏదో ఆలోచనతో నా దృష్టి కేలండర్ మీద పడింది. ఇంకా పది రోజుల గడు వుంది. ఈ లోపు ఇల్లు ఖాళీ చెయ్యాలి! 'ఇంకో అద్దింటికి పోతే పోలే' అని అనిపించింది. ఈ రోజుల్లో అదంత సులువుగా కుదుర్తుందా? ఏ ఇంటికెళ్ళాలన్నా ఒకటి రెండు నెలల అడ్వాన్సూ అద్దె. మాకుంటున్న 'దరిద్రం' తలచుకుంటేనే జీవితం మీద విరక్తి పుడుతుంది...**

ఆ కాలం పోయింది ... ఎప్పుడో పోయింది ... నెలకు ఇరవై రూపాయిలద్దె ... తినడానికి రెండు రొట్టెలు ...! కానీ మేమప్పుడు చిన్నవాళ్ళం! కష్టమంటే ఎరగని వయసు! దారిద్ర్యమంటే ఏమిటో తెలియని జీవులం! 'జీవితమంతా చిన్నపిల్లాడిలా వుండిపోతే ఎంత బావుణ్ణు' అనిపిస్తోంది.

నేను జల తరంగాన్ని వాయిస్తూంటే, మా అమ్మానాన్నలు జలజాసనము మీద కూర్చొని సంబరపడుతున్న – సాక్షాత్తు సరస్వతి–బ్రహ్మదేవుళ్ళా, తమ సృష్టి అతీతమయిందని ఆనందంగా నవ్వుతున్నట్టు, వారి కళ్ళలోని ఆనందం "మమ్మ మమ్మరె మమ్మా!" అని పలుకుతున్నట్టు ... ఇంకా ఏవేవో కలలు, ఊహలు!

నా కలలు కలల్లాగే మిగిలిపోయాయి! నా ఊహలకు రెక్కలొచ్చి ఎక్కికడికో ఎగిరి, తిరిగి రాలేవంత దూరంగా వెళ్ళిపోయాయి!

దీనికి కారణం మా నాన్నగారు. అప్పుడు నాకు పద్దెనిమిదో ఏడు. "నేను సంగీతం నేర్చుకుంటాను" అని మా నాన్నగారితో చెప్పాను. ఆయన నిట్టూర్చి "సంగీతం నేర్చుకొని ఏమి చేస్తావురా. వీధులంట పాడుతూ తిరుగుతావా? నీ చదువేదో ఏడ్చి తగలడు. ఇష్టం లేకపోతే ఏదైన వర్క్ షాప్ వెతుక్కో. నాల్గు పైసలయినా సంపాదించవచ్చు.." అన్నాడు.

'ఇవి నాన్నగారి మాటలేనా!' అని ఆశ్చర్యపోయాను. చిన్నప్పుడు నా వాదన విని తెగ సంతోషించి పొగడేవారు– "నా కొడుకు పెద్ద సంగీతకారుడవుతాడు" అని. అవన్నీ మాట వరసకేనా. నేనారోజు కన్నీరు ఆపుకోలేకపోయాను. అమ్మ నన్ను సముదాయించింది. అమ్మ వడిలో అలాగే నిదురోయాను. అమ్మ ఆప్యాయతకు కరిగిపోయి, నా తప్పున్నా, లేకున్నా క్షమాపణ చెప్పకోవాలని కన్నీటితోనే క్షమాపణ కోరేవాణ్ణి.

* * *

ఆ రోజు రాత్రి వినపడ్డ మాటలు నన్ను కృంగతీశాయి. అమ్మ బ్రతిమాల్తోంది. "పిల్లాడేదో మోజు పడినట్టున్నాడు. సంగీతం నేర్చుకోవడానికి పోనీరాదేవండి?" అమ్మ చెబుతోంది.

"పిచ్చి పిచ్చిగా మాట్లాడొద్దు. నాకిష్టం లేదనుకుంటున్నావా? మన పరిస్థితులకు తినడానికే సరిగ్గా 'కూడు' లేదు. స్కూల్ ఫీజ్ కట్టడానికెన్ని అవస్థలు పడుతున్నానో తెలీదా? రత్న చేతి కొచ్చింది. దాని పెళ్ళెలా చెయ్యాలా అని ఆలోచిస్తున్నాను" నాన్నగారు అంటున్న మాటలు సూటిగా నా హృదయాన్ని తాకేయి.

నేనపార్థం చేసుకున్నాను. నాన్నెంత మంచివారు! నేను సంగీతం నేర్చుకోవడం తనకిష్టమే. కానీ.... డబ్బు లేకపోవడం... సమస్యగా అడ్డొస్తోంది.

డిగ్రీ పూర్తయింది. ఉద్యోగం లేదు. ఎక్కడికెళ్ళినా లంచాలు! నా బ్రతుకంతా నిరుద్యోగిలా వుండిపోవటమేనని బాధపడ్డాను. నా వయసిప్పుడు ఇరవైనాలుగు.

సరిగ్గా అద్దె కట్టలేనందున ఇంటి ఓనర్ ఇల్లు ఖాళీ చెయ్యాలని నెల రోజులు గడువిచ్చాడు. ఇంక పది రోజుల్లో ఆ గడువు ముగిసిపోతుంది... ఈ దారిద్ర్యాన్ని ఎదుర్కోవాలంటే కావల్సింది ఉద్యోగం. మా నాన్నకొచ్చే ఎనిమిది వందలతోనే మా అవసరాలు తీర్చుకుంటున్నాం. ఆయనిప్పుడు త్రాగుతారు. రోజుకొకటి–రెండు ప్యాకెట్ల సారాయి త్రాగుతుంటారు. త్రాగాలని త్రాగటం లేదు. విషాదాన్ని మర్చిపోవడానికి త్రాగి మౌనంగా దాని మత్తులో వుండిపోతారు.

కాని అమ్మ పరిస్థితిని నేను చూడలేపోతున్నాను. అందరినీ ఆనందపర్చాలని, అందరి కడుపు నింపాలని, ఉన్న దాంట్లోనే సమానంగా పంచిపెట్టేది. కొన్నిసార్లు తన భాగం చెల్లాయికీ, నాకు సర్దేది. తను పస్తులుండేది.

రైతుల సంతోషం కోసం వర్షం కురిపించాలని, నీళ్ళు త్రాగడానికి వేగంగా పయనించే మేఘాలు అమ్మ దుఃఖాన్ని తొంగి చూడ్డానికి ఒక్క క్షణం అయినా ఆగలేదు. అమ్మ కన్నీరు కారుస్తుంటే అదొక వర్షమని భ్రమపడుతుంది భూదేవి. ఆ వర్షానికి పండే పంట 'మమత' ఒక్కటే!

పోస్టులో నా అపాయింట్‌మెంట్ ఆర్డరొచ్చింది. బ్యాంక్‌లో క్లర్క్ ఉద్యోగం. ఆరు నెలల క్రింద బ్యాంక్ పరీక్ష వ్రాశాను. ఓ నెల క్రిందనే ఇంటర్వ్యూ ఇచ్చాను. లంచాలివ్వలేని మా బలహీనత ఈ ఉద్యోగాన్ని అవినీతి నీడలోకి నెట్టేస్తుందని అనుకున్నాను. ఇంకా 'నిజాయితి' బ్రతికేవుందని అనడానికి నాకు ఉద్యోగం దొరకటమే ఉదాహరణ.

నా ఆనందానికి హద్దు లేదు. అమ్మ వడిలో చిన్నపిల్లాడిలా ఆనంద బాష్పాలు కురిపిస్తూంటే, అమ్మ దేమునికి నమస్కరిస్తూంది. "ఇన్నాళ్ళ నా ప్రార్థనకు ఇప్పుడు ఫలాన్నిచ్చావు. నీ ఋణం ఎలా తీర్చుకోను" అన్నట్టుగా వుంది అమ్మ ముఖభావం. నాన్న గారికిదంతా కలలాగే వుంది. ఆయన నమ్మలేకపోతున్నారు. "భేష్! భేష్!" అని నా భుజాన్ని తట్టేరు.

నా కాళ్ళ మీద నిలబడ్డానికి ఆసరా ఇచ్చిందీ ఉద్యోగం. ఇక సంగీతం నేర్చుకోవచ్చు. చెల్లాయి రత్న పెళ్ళి నిశ్చింతగా చేయొచ్చు. కలసి వస్తే సంతోషాన్ని దాచుకోవడానికిక్కూడా చోటుండదట. ఇప్పుడు మాకలాగే వుంది.

మా ఇంట్లో మమతకు కరువు లేదు.

నాన్నగారు అప్పడప్పుడూ త్రాగి పారేసిన గ్లాసులు నేను దాచి పెట్టేవాణ్ణి. అవి నేల మీద వరుసగా పేర్చి, ఒక గ్లాసుకు, మరో గ్లాసుకు నీటి స్థాయిని హెచ్చిస్తూ, నీళ్ళు పోసేను క్రమంగా. పెన్సిల్‌తో వాయించుతున్న నా జల తరంగానికి స్పందించే రాగానికిప్పుడు పల్లవి స్ఫురించింది. 'మ–మ–త–ల–కో–వె–ల' అని. అవును మా ఇల్లు ఇప్పుడు మమతల కోవెల. ■

**తెలుగు కళా సమితి, న్యూజెర్సీ– రాజాలక్ష్మి ఫౌండేషన్‌వారు నిర్వహించిన కథల పోటీలో రూ.500 /–లు బహుమతి పొందిన కథ**